అతివలకే అగ్రపీఠం

- 50 శాతం పైబడి పదవులు
- ఎస్సీ, ఎస్టీ, బీసీలకూ ప్రాధాన్యం

మామిడికుదురు: 2019 ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఘన విజయం సాధించి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం పీఠాన్ని అధిష్ఠించారు. నాటి నుంచి నేటి వరకు జగన్ మహిళలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. ప్రతి ఒక్క సంక్షేమ పథకం వారి పేరిటే అమలు చేస్తున్నారు. వీటితో పాటు నామినేటెడ్ పోస్టులు, పార్టీ పదవుల్లో సైతం అగ్రభాగం వారిదే. 50 శాతానికి పైబడి నామినేటెడ్ పదవులు, పార్టీ పదవులను వారికే కేటాయిస్తూ మహిళలను అన్ని రంగాల్లోను ముందు వరుసలో నిలిపారు. రేషన్‌కార్డులు, ఇళ్ల పట్టాలు, ఇళ్ల రుణాలు, సంక్షేమ పథకాలు మహిళల పేరిటే అమలు చేస్తున్నారు. సమాజంలో మహిళలకు ఎనలేని ప్రాధాన్యమిస్తూ వారి గొప్పతనాన్ని ప్రజలకు చాటి చెబుతున్నారు. ప్రభుత్వం తమకు ఇస్తున్న ప్రాధాన్యతను చూసి నారీమణులు తమకు ఇంత కాలానికి తగిన గౌరవం లభించిందని సగర్వంగా తలెత్తుకుంటున్నారు.

నామినేటెడ్ పదవుల్లో..

నామినేటెడ్ పదవుల్లో 50 శాతానికి పైగా మహిళలకే కేటాయిస్తున్నారు. వీరిలో ప్రధానంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ఎక్కువ పదవులు కేటాయిస్తున్నారు. నగరం, అంబాజీపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ పదవులతో పాటు అప్పనపల్లి బాల బాలాజీ దేవస్థానం, అయినవిల్లి వర సిద్ధి వినాయకస్వామి ఆలయ పాలక వర్గ పదవుల్లో 50 శాతానికి పైగా మహిళలకే కేటాయించారు. నగరం ఏఎంసీ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవితో పాటు వైఎస్ చైర్మన్ పదవిని సైతం మహిళలకే కేటాయించడం ద్వారా వారికి సమున్నత స్థానం కల్పించారు.



జగనన్న ప్రభుత్వంలో తమకు ఎనలేని గుర్తింపు లభించిందని మహిళలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మహిళలకు గుర్తింపు



సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మహిళలకు ఎనలేని గుర్తింపునిచ్చారు. నామినేటెడ్ పోస్టులతో పాటు పార్టీ పదవుల్లోనూ తమకు సముచిత స్థానం కల్పించారు. అప్పనపల్లి బాల బాలాజీ స్వామి వారి ధర్మకర్తల మండలిలో మొత్తం ఎనిమిది మంది సభ్యులకు గాను నాలుగు పదవులను మహిళలకు ఇచ్చి ఎనలేని గుర్తింపునివ్వడం సంతోషంగా ఉంది.

– బత్తుల విజయగంగారత్నం, అప్పనపల్లి దేవస్థానం ట్రస్టీ

చాలా ఆనందంగా ఉంది



నగరం వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలక వర్గం నియామకంలో మహిళలకు ఎంతో ప్రాధాన్యం లభించింది. మార్కెట్ కమిటీ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా చైర్మన్, వైస్ చైర్మన్ పదవితో పాటు ఆరుగురిని డైరెక్టర్లుగా నియమించారు. మార్కెట్ కమిటీ పాలక వర్గంలో మొత్తం 15 పదవుల్లో 8 పదవులు మహిళలకు ఇవ్వడం చాలా ఆనందంగా ఉంది.

– యాండ్ర పద్మ, నగరం వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్

బడుగులకు ప్రాధాన్యం



సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మహిళలకు ఎంతో ప్రాధాన్యం ఇస్తున్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళలకు అన్ని విధాలా ప్రోత్సహిస్తున్నారు. పార్టీ పదవులతో పాటు నామినేటెడ్ పదవుల్లో సైతం మాకు తగిన గుర్తింపునిస్తున్నారు. ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతతో గతంలో వంటింటికే పరిమితమైన మహిళలు నేడు సగర్వంగా రాజకీయాల్లో రాణిస్తున్నారు.

– బడుగు దుర్గాదేవి, అయినవిల్లి దేవస్థానం ట్రస్టీ

మహిళల గౌరవాన్ని చాటి చెప్పారు



సమాజంలో మహిళల పాత్ర చాలా ప్రధానమైంది. ఇంత కాలం మాకు తగిన ప్రాధాన్యత లభించలేదు. సామాజికంగా, రాజకీయంగా పదవులన్నీ పురుషులకే దక్కేవి. జగన్‌మోహన్‌రెడ్డి సీఎం పదవిని అధిష్ఠించిన తర్వాత మా గౌరవాన్ని ప్రపంచానికి చాటి చెప్పారు. అన్నింటా మాకు అగ్రతాంబూలం వేస్తూ మా ప్రాధాన్యతను మరింత ద్విగుణీకృతం చేశారు.

– రాయుడు లక్ష్మి, అంబాజీపేట మార్కెట్ కమిటీ డైరెక్టర్

క్లుప్తంగా

నేడు విద్యుత్ బిల్లుల స్వీకరణ

మలికిపురం: మండలంలో విద్యుత్ బిల్లుల చెల్లింపు తేదీల్లో సవరింపులు చేసినట్లు మండల విద్యుత్ శాఖ ఏఈ మద్దూరి సతీష్ ఆదివారం తెలిపారు. ఈ నెల 14న జరగాల్సిన కేశనపల్లి గ్రామ పంచాయతీ వద్ద విద్యుత్ బిల్లుల స్వీకరణను సోమవారానికి మార్చినట్లు ఆయన తెలిపారు. సోమవారం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 3.30 గంటల వరకూ బిల్లు కలెక్టర్ అందుబాటులో ఉంటారని తెలిపారు. అలాగే ఈ నెల 15న జరగాల్సిన మట్టపర్రు విద్యుత్ బిల్లుల స్వీకరణ తేదీని 17కి మార్చినట్లు తెలిపారు. సంక్రాంతి కారణంగా ఆ రోజుల్లో జరగాల్సిన బిల్లుల స్వీకరణను ఇలా మార్చినట్లు ఆయన వివరించారు.

కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు

అంబాజీపేట: మండలంలో కోడి పందేలు, జూదాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై ఎ.చైతన్యకుమార్ ఆదివారం చెప్పారు. అంబాజీపేట మండలంలోని ముఖ్య గ్రామాల్లో ఫ్లెక్సీలను ఏర్పాటు చేయనున్నామన్నారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బరుల వద్ద 144 సెక్షన్ అమలు పరుస్తున్నారన్నారు. గ్రామాల్లో ఎక్కడా కోడి పందేలు, జూదాలు నిర్వహించకూడదన్నారు. సంక్రాంతి పేరుతో పేకాట, కోడి పందేలు, గుండాటలు నిర్వహిస్తే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలంతా పోలీసులకు, రెవెన్యూ అధికారులకు సహకరించాలని కోరారు.

500 మందికి ఉచిత వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ అశోక్‌వర్మ

మామిడికుదురు: గోగన్నమఠంలో భూపతిరాజు భరత్‌వర్మ స్మారకార్థం ఆదివారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో కిడ్నీ స్పెషలిస్ట్ భూపతిరాజు అశోక్ వర్మ, డాక్టర్లు పి.కిరణ్మయి, ఎం.రమేష్, సాగిరాజు గజపతిరాజు, చొల్లంగి అనిల్ రోగులకు ఉచితంగా పరీక్షలు చేశారు. ఈ శిబిరం ద్వారా సుమారు 500 మందికి ఉచితంగా పరీక్షలు నిర్వహించి రూ.60 వేలు విలువైన మందులను ఉచితంగా అందజేశారు. గుండె, కిడ్నీ, నరాలు, ఊపిరితిత్తులు, లివర్, జనరల్ సర్జరీ, బీపీ, సుగర్, థైరాయిడ్, జనరల్ సమస్యలకు సంబంధించిన రోగులకు ఉచితంగా సేవలందించారు. బ్లడ్, యూరిన్, ఈసీజీ టెస్టులు చేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ భూపతిరాజు ఈశ్వరరాజువర్మ, భూపతిరాజు సత్తిబాబురాజు, పీఏసీఎస్ చైర్మన్ సాగి పీఆర్‌వీఎస్ఎస్ నర్సింహవర్మ, అల్లు సురేష్, భూపతిరాజు ఆంజనేయరాజు, అనుసూరి పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

గరుడ మంత్రకేసరి చినసూర్యనారాయణ మృతి



మామిడికుదురు: పాశర్లపూడిలంకకు చెందిన గరుడ మంత్ర కేసరి బిరుదాంకితుడు గంటి చినసూర్యనారాయణ అలియాస్ చిట్టిబాబు (75) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. ఆయనకు భార్య నాగమణి, ఒక కుమారుడు, ముగ్గురు కుమార్తెలు సంతానం. చినసూర్యనారాయణ 25 ఏళ్ల క్రితం పాశర్లపూడిలంకలో వైనతేయ గోదావరి నదీతీరాన సుబ్రహ్మణ్యస్వామి ఆలయం నిర్మించారు. ఈ ఆలయం వద్ద ప్రతి ఏడాది మాఘశుద్ధ చవితి, మహా శివరాత్రి పర్వదినాల్లో ఇతని ఆధ్వర్యంలో నాగ ప్రతిష్ఠలు నిర్వహిస్తారు. వివాహం కాని వారు, నాగదోషం ఉన్న వారు, సంతానం లేని వారు ఇక్కడ నాగప్రతిష్ఠలో పాల్గొంటారు. సుదూర ప్రాంతాల నుంచి ఎంతో మంది సుబ్రహ్మణ్య స్వామి ఆలయానికి వచ్చి చినసూర్యనారాయణ ఆధ్వర్యంలో పూజలు చేస్తారు. పాము కాటుకు మంత్రం వేయడం, పాములను బంధించి తీసుకు వెళ్లి నిర్జన ప్రదేశాల్లో విడిచి పెట్టడంలో ఇతను దిట్ట. చినసూర్యనారాయణ మృతికి పలువురు సంతాపం తెలిపారు.

సర్పంచ్‌ల పాదయాత్ర

మలికిపురం: నియోజకవర్గ టీడీపీ సర్పంచ్‌లు మలికిపురం నుంచి అమలాపురం వరకూ పాదయాత్ర చేపట్టారు. పంచాయతీలకు కేంద్రం ఇస్తున్న నిధులను వెంటనే పంచాయతీ ఖాతాలకు జమ చేయాలని, సర్పంచ్‌ల విధుల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు ఇవ్వాలని, పంచాయతీలో వైఎస్సార్ సీపీ కన్వీనర్‌ల నియామకం ఉప సంహరించాలని కూడా సర్పంచ్‌లు డిమాండ్ చేశారు.

సారాతో వ్యక్తి అరెస్టు

ఆత్రేయపురం: మండలంలోని రాజవరంలో ఆదివారం ఏటిగట్టుపై సారా విక్రయిస్తున్న ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకుని 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై సీహెచ్ సుధాకర్ తెలిపారు. వ్యక్తితో పాటు 20 లీటర్ల సారా, టీవీఎస్ బైక్ స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్సై తెలిపారు.

శెట్టిబలిజ ఆత్మీయ సమావేశం

పి.గన్నవరం: నాగుల్లంకలో ఆదివారం టీడీపీ శెట్టిబలిజ సాధికార ఆత్మీయ సమావేశం జరిగింది. శాసన మండలి మాజీ డిప్యూటీ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఆర్థిక సాయం



అగ్నిప్రమాద బాధితులకు బియ్యం అందజేస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

రావులపాలెం: స్థానిక కొత్తకాలనీలో ఈ నెల ఆరోతేదీ తెల్లవారుజామున సంభవించిన అగ్ని ప్రమాదంలో నష్టపోయి బాధితులకు ఆదివారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి రూ.21 వేల ఆర్థిక సాయం, బియ్యం అందజేశారు. అగ్ని ప్రమాదంలో పూర్తిగా, పాక్షికంగా నష్టపోయిన బాధితులైన మానుపాటి సతీష్, బందరి శ్రీను, తదితర కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే జగ్గిరెడ్డి పరామర్శించి సాయాన్ని అందజేశారు. ప్రభుత్వం నుంచి అందాల్సిన సహాయ సహకారాలు త్వరగా అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీపీ కర్రి లక్ష్మీవెంకట నాగదేవి, జెడ్పీటీసీ కుడుపూడి శ్రీనివాసరావు, సర్పంచ్ తాడేపల్లి నాగమణి, ఉప సర్పంచ్ గొలుగూరి మునిరెడ్డి, వైస్ ఎంపీపీ బొక్కా ప్రసాద్, ఎంపీటీసీ కోట విజయకుమారి, మాజీ ఎంపీటీసీ సభ్యుడు కర్రి వీర్రెడ్డి, వార్డు సభ్యుడు గెద్దాడ నాగేశ్వరరావు, ఆదిరెడ్డి, గోపి తదితరులు పాల్గొన్నారు.

దాతల సహకారం అభినందనీయం



చింతలపల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాపాక

రాజోలు: పాఠశాల అభివృద్ధికి తోడ్పాటు అందించిన దాతల సాయం అభినందనీయమని ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. ఆదివారం చింతలపల్లి ఉన్నత పాఠశాల ఆటస్థలానికి దాతలు సమకూర్చిన రూ.8 లక్షల నిధులతో నిర్మించిన ప్రహరీ పనులను ఎమ్మెల్యే రాపాక ప్రారంభించారు. దాతలు సత్యనారాయణరాజు(శ్రీనురాజు), గూడూరు వెంకటరాజులతో పాటు పలువురు గ్రామస్తులు ప్రహరీ నిర్మాణానికి సహకరించారు. ఆటస్థలం అభివృద్ధి చేయడం ద్వారా విద్యార్థులను చక్కగా క్రీడాశిక్షణ ఇవ్వవచ్చని ఎమ్మెల్యే రాపాక అన్నారు. ప్రహరీ నిర్మాణానికి సహకరించిన దాతలను ఎమ్మెల్యే అభినందించారు. మాజీ డిప్యూటీ స్పీకర్ ఏవీ సూర్యనారాయణరాజు, సర్పంచ్ మట్టా ప్రసన్నకుమారి, పేరెంట్స్ కమిటీ చైర్మన్ నల్లి నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

సీఆర్‌సీ సంక్రాంతి ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ



సంక్రాంతి ఉత్సవాల ఆహ్వాన పత్రిక ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

రావులపాలెం: సీఆర్‌సీ సంక్రాంతి, వేమన జయంతి ఉత్సవాల ప్రోమో వీడియో, ఆహ్వాన పత్రికను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ఆదివారం ఆవిష్కరించారు. స్థానిక అక్షర థియేటర్ వద్ద జరిగిన కార్యక్రమంలో జగ్గిరెడ్డి ఆవిష్కరించి సీఆర్‌సీ, వేమన జయంతి ఉత్సవ కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కుడుపూడి శ్రీనివాసరావు, సర్పంచ్ తాడేపల్లి నాగమణి, ఉప సర్పంచ్ గొలుగూరి మునిరెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యుడు కర్రి వీర్రెడ్డి, సీఆర్‌సీ అధ్యక్షుడు తాడి నాగ మోహనరెడ్డి, ఓల్డేజ్ హోమ్ అధ్యక్షుడు సత్తి రామకృష్ణారెడ్డి, సీఆర్‌సీ కార్యదర్శి కర్రి అశోక్‌రెడ్డి, డైరెక్టర్లు నల్లమిల్లి వీర్రాఘవరెడ్డి, కొవ్వూరి నరేష్‌కుమార్‌రెడ్డి, చిర్ల కనికిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉల్లాసంగా సంక్రాంతి సంబరాలు



కొత్తపేటలో సంక్రాంతి ప్రభను ఊరేగిస్తున్న బాలలు

కొత్తపేట: స్థానిక ప్రియదర్శినీ బాలవిహార్‌లో బాలలు ముందుగానే సంక్రాంతి సంబరాలు జరుపుకొన్నారు. బాలవిహార్ కరస్పాండెంట్ ఏబీసీ దేవ్ ఆధ్వర్యంలోఉపాధ్యాయులు, విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి వచ్చి ఉల్లాసంగా ఉత్సాహంగా భోగి, సంక్రాంతి, కనుమ పండుగల సంప్రదాయాలతో కళ కట్టించారు. మగపిల్లలు భోగి మంటలు వేశారు. నర్సరీ పిల్లలకు భోగిపళ్లు పోశారు. ఆడపిల్లలు అందరూ గొబ్బెమ్మలు పెట్టారు. వివిధ సంక్రాంతి పాటలకు నృత్యం చేశారు. పాఠశాల ఆవరణ అంతటా రంగవల్లులు తీర్చిదిద్దారు. సూర్యనారాయణమూర్తి చిత్రపటంతో సంక్రాంతి ప్రభను అలంకరించి పాఠశాల పరిసర వీధుల్లో ఊరేగించారు. స్థానికులు ప్రభను దర్శించుకుని ప్రియదర్శినీ బాలలు ముందుగానే సంక్రాతి పండగ తీసుకువచ్చారంటూ అభినందించారు.

అలరించిన గొబ్బెమ్మలు



అంబాజీపేటలో అలరించిన చిన్నారుల గొబ్బెమ్మలు

అంబాజీపేట: రానున్న సంక్రాంతి పండగను పురస్కరించుకుని ధనుర్మాసంలో నిర్వహించిన చిన్నారుల గొబ్బెమ్మలు ఎంతో అలరించాయి. అంబాజీపేట పెద్ద వీధిలోని దీక్షిత్‌నగర్‌కు చెందిన వాడ్రేవు సూర్యనారాయణమూర్తి, సత్యభాను దంపతుల కుమార్తె సత్య రేణుక ఆదివారం గొబ్బెమ్మలతో పూజ నిర్వహించారు. పలువురు మహిళలు మాట్లాడుతూ భారతీయ సాంస్కృతిక సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తాయన్నారు. కృష్ణుడు, గోపిక, గోమాతలకు గుర్తులుగా ఆవుపేడతో చేసిన మూడు గొబ్బెమ్మలను ఉంచి పలు ఆధ్యాత్మిక కీర్తనలతో చిన్నారులు నృత్యం చేస్తారన్నారు. కార్యక్రమంలో పలువురు చిన్నారులు, మహిళలు పాల్గొన్నారు.

ముగ్గుల పోటీలు

అంబాజీపేట: సంక్రాంతి పండగను పురస్కరించుకుని మొసలపల్లిలో సర్పంచ్ దంతులూరి ఉమాదేవి, వైఎస్సార్ సీపీ నాయకుడు దంతులూరి శ్రీనురాజు ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా ఆర్యవైశ్య మహిళా సంఘ డైరెక్టర్ గోళ్ల బాలదేవి పర్యవేక్షణలో ఆదివారం నిర్వహించిన ముగ్గుల పోటీలు పలువురిని అలరించాయి. పోటీల్లో గెలుపొందిన మహిళలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను కంపెనీ ప్రతినిధులు అందజేశారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా ఆర్యవైశ్య మహిళా సంఘ అధ్యక్షురాలు యెండూరి సీతామహాలక్ష్మి, అడిషనల్ కార్యదర్శి నూలు వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి

సఖినేటిపల్లి: డాక్టర్ అంబేడ్కర్ ఆశయాలను ఆలోచింపచేయడమే ఏఏఎఫ్(అంబేడ్కర్ ఆలోచన ఫౌండేషన్) ముఖ్య ఉద్దేశమని సఖినేటిపల్లి రత్నాలపేటకు చెందిన హైకోర్టు సీనియర్ న్యాయవాది గొల్ల జయప్రకాష్ అన్నారు. ఆదివారం రత్నాలపేటలోని జయప్రకాష్ ఇంటి వద్ద ఏఏఎఫ్ సమావేశంలో ఆయన మాట్లాడారు. దళిత న్యాయవాదులు అంబేడ్కర్ ఆశయాల లక్ష్యసాధనకు కృషి చేయాలన్నారు. జ్ఞానసముపార్జన ద్వారా ఉన్నత శిఖరాలను అధిరోహించిన ఎస్సీ, బడుగు, బలహీనవర్గాల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. భవిష్యత్తులో రానున్న ఎన్నికల్లో ఏపీలో ఎస్సీ, ఎస్టీలే ఎన్నికలను శాసించే దిశగా నిర్మాణం చేస్తున్నట్టు, సమర్థుడైన అంబేడ్కర్ వాదిని నిలబెట్టి, పోటీచేయించి ఆయన విజయానికి న్యాయవాదులు కృషి చేస్తారన్నారు.

వెంకన్నకు అష్టోత్తర పూజలు

ఆత్రేయపురం: వాడపల్లి శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం స్వామి వారి అష్టోత్తర పూజలు ఘనంగా నిర్వహించారు. ఏడు శనివారాల నోము ఆచరించిన భక్తులు తమ మొక్కులు తీర్చుకునేందుకు ఈ పూజలో పాల్గొంటారు. ఉదయం స్వామిని ప్రత్యేకంగా పువ్వులతో అలంకరించారు. ఉదయం సుప్రభాత సేవ, నీరాజన మంత్రపుష్పం తదితర పూజలను నిర్వహించారు. ఏర్పాట్లను ఆలయ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈవో ముదునూరి సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో ఆలయ కమిటీ సభ్యులు, సిబ్బంది పర్యవేక్షించారు. ఈవో మాట్లాడుతూ ఈనెల 14న గోదాదేవి కల్యాణం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కల్యాణంలో పాల్గొనే భక్తులు రూ.750 చెల్లించాలన్నారు.

కిక్కిరిసిన విఘ్నేశ్వరుని ఆలయం

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వరస్వామిని ఆంధ్రప్రదేశ్ మాజీ శాసనమండలి డిప్యూటీ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం ఆదివారం దర్శించుకున్నారు. ఆయనకు అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఆయన స్వామికి 108 కొబ్బరికాయల మొక్కు తీర్చుకున్నారు. వేదపండితులు వేదమంత్రాలతో సత్కరించి స్వామి చిత్రపటం, ప్రసాదం అందజేశారు.

విఘ్నేశ్వరుని సన్నిధిలో మాజీ మండలి డిప్యూటీ చైర్మన్

స్థానిక విఘ్నేశ్వరుని ఆలయం ఆదివారం భక్తులతో కిక్కిరిసింది. ఆలయ ప్రధానార్చకులు వినాయకరావు ఆధ్వర్యంలో స్వామికి విశేష పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారి లఘున్యాస అభిషేకాల్లోను, లక్ష్మీ గణపతి హోమంలోను భక్త దంపతులు పాల్గొన్నారు. నూతన వాహనాలకు పూజలు చేశారు. స్వామివారి ప్రత్యేక దర్శనం ద్వారా రూ.14,700, అన్న ప్రసాదాలకు వచ్చిన విరాళాలు రూ.1,64,789, వివిధ సేవలకు రూ.18,090, ప్రసాదాల విక్రయం ద్వారా రూ.25,465, వివిధ విరాళాల ద్వారా రూ.20,000 మొత్తం రూ.2,43,574లు ఆదాయం లభించిందని ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు.

పేద కుటుంబానికి ఆర్థిక సాయం



పేద కుటుంబానికి ఆర్థికసాయం అందిస్తున్న దాత ప్రభాకరరావు

ఆలమూరు: ఆలమూరు శివారు దేవి కాలనీలో పతీ వియోగంతో బాధపడుతున్న ధనికొండ రత్నం కుటుంబానికి ఆదివారం ఆర్థికసాయం అందింది. గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ రాష్ట్ర సేవాదళ్ సంయుక్త కార్యదర్శి చల్లా ప్రభాకరరావు ఆకుటుంబానికి రూ.పదివేల ఆర్థికసాయం, 50 కేజీల బియ్యం, నూతన వస్త్రాలను అందించారు. ఇటీవల కుటుంబ పెద్ద, భర్త నల్లయ్య అనారోగ్యంతో మృతి చెందడంతో కుటుంబం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుంది. దీంతో దాత ప్రభాకరరావు స్పందించి ఆమె కుటుంబానికి అండగా నిలిచారు.

కాంగ్రెస్ కార్యాలయ భవన నిర్మాణానికి కృషి

కొత్తపేట: నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యాలయ భవనాన్ని అందరి సహకారంతో నిర్మించేందుకు కృషి చేస్తానని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడి(డీసీసీ)గా నియమితులైన కామన ప్రభాకరరావు అన్నారు. ఆదివారం జిల్లా, మండల నాయకులతో కలసి స్థానిక కాంగ్రెస్ పార్టీ స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఆ పార్టీ అమలాపురం, పి.గన్నవరం నియోజకవర్గాల ఇన్‌చార్జ్‌లు అయితాబత్తుల సుభాషిణి, ఎం మోహన్‌రావు పాల్గొన్నారు.

10 లోపు గృహ సారథులను నియమించాలి



ఎమ్మెల్యే చిట్టిబాబు

మామిడికుదురు: సీఎం జగన్ ఆదేశాల మేరకు గ్రామ పరిధిలో ప్రతి క్లస్టర్‌కు ఇద్దరు గృహ సారథులను నియమించుకుందామంటూ ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఆయన ఆదివారం దీనికి సంబంధించి ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఇద్దరు సారథుల్లో ఒకరు విధిగా మహిళ ఉండాలన్నారు. ఈ నెల 10 లోగా ఈ ప్రక్రియను పూర్తి చేసి పార్టీ కేంద్ర కార్యాలయానికి పంపించాల్సి ఉందన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో గృహ సారథులదే కీలక పాత్ర కాబోతుందని చిట్టిబాబు పేర్కొన్నారు. పార్టీకి విధేయత కలిగిన వ్యక్తులనే సారథులుగా నియమించాలని, ఇద్దరిలో ఒకరు వలంటీర్ కుటుంబానికి చెందిన వారై ఉండాలన్నారు. గ్రామ వలంటీర్లను సారథులుగా నియమించరాదని సూచించారు. జగనన్న సచివాలయ కన్వీనర్లు, గ్రామ వలంటీర్ల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని గృహ సారథులను నియమించాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. క్లస్టర్‌లో నివసించే స్థానికులై ఉండాలని, ఆ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని పార్టీ శ్రేణులకు ఎమ్మెల్యే చిట్టిబాబు సూచించారు.

యంత్రాలతో నాట్లు వేస్తే అధిక దిగుబడులు



మొసలపల్లిలో యంత్రంతో వేస్తున్న వరినాట్లు

అంబాజీపేట: ఈ ఖరీఫ్‌లో వరినాట్లను యంత్రాల సాయంతో వేయడం మంచిదని, సమయం, ఖర్చు, తగ్గడంతో పాటు అధిక దిగుబడులు పెంచుకోవచ్చని వ్యవసాయాధికారులు రైతులకు సూచించారు. వరి నాట్లు యంత్రంతో వేస్తే ఎకరాకు 12 నుంచి 15 కిలోల విత్తనాలను సరిపోతాయన్నారు. సంప్రదాయ పద్ధతిలో ఎకరా నారుమడికి 30 నుంచి 40 ఎకరాల్లో విత్తనాన్ని వాడుతున్నారన్నారు. యాంత్రీకరణ ద్వారా విత్తన ఖర్చు 50 శాతం వరకు తగ్గించుకోవచ్చన్నారు. కూలీలు అందుబాటులో లేని ఈ కాలంలో శ్రమ లేకుండా ఊడ్పులు పూర్తి చేయవచ్చన్నారు. యంత్రాలను ఉపయోగించడం వల్ల 15 రోజులు ముందుగానే వరినాట్లు వేయవచ్చన్నారు. యంత్రంతో ఎకరా చేను గంట వ్యవధిలో ఊడ్పు పూర్తి చేయవచ్చన్నారు. 15 రోజులు ముందుగా వరి నారును ట్రేలలో పోయాలన్నారు. వరి నారు ఎకరాకు 70 ట్రేలు సరిపోతాయన్నారు. మొక్కకు మొక్కకు వరుసకు మధ్య 8 అంగుళాల దూరంలో కుదురుకు 2 మొక్కలు చెప్పున యంత్రం తూర్పు, పడమరలుగా ఊడుస్తుంది. దీనివలన పైరుకు గాలి, వెలుతురు సోకి చీడపీడల బెడద తగ్గుతుంది. దుబ్బుకు బలం చేకూరి విపత్తులను ఎదుర్కొనే శక్తి ఎక్కువగా ఉంటుంది. 15 రోజుల వయసున్న లేత నారు నాట్లు వేయడం వలన దుబ్బు బాగా చేసి దిగుబడి వచ్చే అవకాశాలున్నాయన్నారు. యంత్రం వల్ల కూలీల కంటే తక్కువ ఖర్చుతో నాట్లు వేసుకోవచ్చన్నారు. నియోజకవర్గంలో అంబాజీపేటలో 3,300, అయినవిల్లిలో 8,186, పి.గన్నవరంలో 5,780, మామిడికుదురులో 1,621 ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. అంబాజీపేట మండలంలో యంత్రాల సాయంతో వరి నాట్లును 500 ఎకరాల్లో వేస్తున్నట్లు ఏఓ సీహెచ్‌డీ విజయ్‌కుమార్ తెలిపారు.

300 కేజీల గంజాయి పట్టివేత

రావులపాలెం: కోడిగుడ్ల తరలించే వ్యానులో రవాణా చేస్తున్న గంజాయిని ఈతకోట టోల్‌గేట్ సమీపంలో జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి రావులపాలెం పోలీసులు పట్టుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు.. అనపర్తికి చెందిన వ్యాన్‌లో కోడిగుడ్లను విశాఖపట్నం, చోడవరానికి తీసుకువెళ్లారు. తిరుగుప్రయాణంలో ఓ వ్యక్తి ద్వారా ఏడు బస్తాల గంజాయిని సిద్ధాంతంలో దింపాలని ఒప్పందం కుదుర్చుకున్నారు. వ్యాన్‌లో ఖాళీ కోడిగుడ్ల అట్టల మధ్యలో గంజాయి బస్తాలు వేసుకుని తరలిస్తుండగా పోలీసులు టోల్‌గేట్ సమీపంలో వ్యాన్‌ను ఆపారు. డ్రైవర్ పారిపోతుండగా పట్టుకున్నారు. దీనిపై రావులపాలెం సీఐ రజనీ కుమార్‌ను 'సాక్షి' వివరణ కోరగా.. సుమారు రూ.6 లక్షల విలువైన 300 కేజీల గంజాయిని పట్టుకుని, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నామన్నారు. మిగిలిన వివరాలపై దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

నాట్లు వేసిన జెడ్పీటీసీ ప్రసన్నకుమారి



రామరాజులంకలో వరి నాట్లు వేస్తున్న జెడ్పీటీసీ ప్రసన్నకుమారి

మలికిపురం: మండల జెడ్పీటీసీ సభ్యురాలు బల్ల ప్రసన్నకుమారి వారి నాట్లు వేసి స్థానికులను ఆకట్టుకున్నారు. ఆదివారం ఆమె మండలంలోని రామరాజులంకలో పర్యటించారు. గ్రామంలో జరుగుతున్న వరి నాట్లను పరిశీలించారు. అక్కడ కూలీలతో కలసి ఆమె కూడా నాట్లు వేశారు. ఆమె మాట్లాడుతూ వ్యవసాయ అభివృద్ధికి సీఎం జగన్ అనేక పథకాలు అమలు చేస్తున్నారని వాటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సాగుకు ముందే పెట్టుబడి అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలోవైఎస్సార్ సీపీ పార్టీ నాయకులు రావి గోపాలకృష్ణ, బాలకృష్ణ, దేవ దయానంద్, చొప్పల రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కేశవస్వామికి లక్ష తులసి పూజ

అయినవిల్లి: ముక్తేశ్వరంలోని ముక్తికాంత సమేత క్షణ ముక్తేశ్వరస్వామి ఆలయంలో వేంచేసిన శ్రీ, భూ సమేత కేశవస్వామికి ఆదివారం పుష్యమాసం బహుళ విదియ సందర్భంగా లక్ష తులసి పూజ నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు అంగర శ్రీకాంత్, అర్చకులు సాయిపవన్ ఆధ్వర్యంలో విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, మండపారాధన, పంచామృతాభిషేకం, లక్షతులసి పూజ, సామూహిక కుంకుమపూజ, హోమం, పూర్ణాహుతి, శాంతి కల్యాణం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారి అన్నప్రసాదం, తీర్థప్రసాదాలు స్వీకరించారు. స్వామిని ఈ సందర్భంగా విశేషంగా పుష్పాలతో అలంకరించారు.

ఆకట్టుకున్న మాలమాస్టీల విన్యాసాలు



సోంపల్లిలో ప్రదర్శనలు చేస్తున్న మాలమాస్టీలు

రాజోలు: స్థానికంగా మాలమాస్టీలు ప్రదర్శించిన విన్యాసాలు ఆకట్టుకున్నాయి. ఆదివారం సోంపల్లిలో జైభీమ్ యూత్ ఆధ్వర్యంలో మాల మాస్టీలు ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. ఇరవై కేజీల రాళ్లను గాలిలోకి ఎగురవేసి భుజం, ఛాతి, వీపు మీద వేసుకోవడం, గాలిలో పల్టీలు కొట్టడం, కొబ్బరికాయను నోటితో ఒలిచి పగలగొట్టడం, 50, 70 కేజీల రాళ్లను సునాయాసంగా ఎత్తారు. ప్రదర్శనల్లో పాల్గొన్న మాలమాస్టీలను జై భీమ్ యూత్ ఆధ్వర్యంలో సత్కరించారు. సర్పంచ్ కట్టా శ్రీనివాసరావు, మండల ఉపాధ్యక్షుడు పి.శ్యాంబాబు, జనసేన నాయకుడు బొంతు రాజేశ్వరరావు, మాజీ సర్పంచ్ సరెళ్ల విజయ్‌ప్రసాద్, విప్పర్తి సాయిబాబు, కొంబత్తుల బాలయోగి తదితరులు పాల్గొన్నారు.